వంద సాధ్యమే

- సాధన చేస్తే గణితంలో వంద మార్కులు
- మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు
- ప్రత్యేక తరగతులతో విద్యార్థులకు తర్ఫీదు
- ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం


ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న పదవ తరగతి విద్యార్థులు

పుట్టపర్తి/ అమడగూరు: విద్యార్థి దశలో పదో తరగతి పరీక్షలు చాలా కీలకంగా ఉంటాయి. వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తే భవిష్యత్తులో ఉన్నత చదువులకు సానుకూలంగా ఉంటుంది. ఆరు సబ్జెక్టుల్లోనూ గణితం అంటే విద్యార్థుల గుండెల్లో వణుకు పుడుతుంది. ఎందుకంటే గణితంలోని వాస్తవ సంఖ్యలు, సమీకరణాలు, రేషియో సమీకరణాలు, త్రికోణమితి, త్రిభుజాలు ఈ చాప్టర్లన్నీ విద్యార్థులకు కష్టంగా ఉంటాయి. అయితే గట్టిగా సాధన చేస్తే ఆ గణితంలోనే మిగిలిన ఐదు సబ్జెక్టుల కంటే సులభంగా వందకు వంద మార్కులు సాధించవచ్చని బోధన సిబ్బంది చెబుతున్నారు. మార్చి 18న పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 24వ తేదీ గణితం పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలో 32 మండలాల పరిధిలో 259 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 13,561 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. మెరుగైన ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల కార్యాచరణ పేరిట విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

గణితంలో మెరుగైన మార్కుల కోసం..

వర్గ సమీకరణలు : వీటిలో మూలాలు కనుగొనుటకు–2 మార్కులు, విచక్షణ కనుగొనుటకు –1 మార్కు ఉంటాయి. వర్గం పూర్తి చేయడం నేర్చుకోవాలి.

నిరూపక రేఖాగణితం : అభ్యాసం –7.2, 7.3 లో ప్రశ్నలు నేర్చుకుంటే అందులో 8 మార్కులకు ఒక ప్రశ్న, 2 మార్కులకు ప్రశ్నలు వస్తాయి.

సమితులు : గణితంలోనే ఇవి చాలా సులభమైనవి. ఇందులో 1, 2, 4 మార్కుల ప్రశ్నలు ఒక్కొక్కటి ఉంటాయి. వీటిని అవగాహన చేసుకుంటే 7 మార్కులు వస్తాయి.

వాస్తవసంఖ్యలు : ఇందులో కరణీయ సంఖ్యల గురించి నేర్చుకుంటే 8, 4 మార్కుల ప్రశ్నలు వస్తాయి.

గ్రాఫ్స్ : బహుపదులు, రెండు చరరాశులలో రేఖీయ సమీకరణ జతలో ఉంటుంది. అందులో బహుపదులలో వచ్చే గ్రాఫ్స్ ఎంచుకుంటే సులభంగా 4 మార్కులు వస్తాయి.

శ్రేడులు : ఈ శ్రేడులతో ముఖ్యంగా సమస్యలపై 8 మార్కులు, అంకశ్రేడిలో 2 మార్కుల ప్రశ్నలు వస్తాయి. అలాగే ఈ పాఠ్యాంశాలలో, చివరన సూత్రాలలో కూడా 4 మార్కుల ప్రశ్న వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే సూత్రాలు బిట్స్‌కు ఉపయోగకరంగా ఉంటాయి.

సరూప త్రిభుజాలు : నిర్మాణానికి 8, 4 మార్కులు, వీటిలో మూలపదాలు గీయడం నేర్చుకోవాలి. వీటిలో 1, 2 మార్కుల ప్రశ్నలుంటాయి.

క్షేత్రమితి : సంపూర్ణతల వైశాల్యం, ఘనపరిమాణం సూత్రాలు 8 నేర్చుకుంటే 4, 2 మార్కుల ప్రశ్నలకు ఉపయోగంగా ఉంటుంది. ఇక బిట్స్‌కోసం చివరన సూత్రాలను నేర్చుకుంటే సరిపోతుంది.

సంభావ్యత : ఈ పాఠ్యాంశంలో 4, 2, 1 మార్కుల ప్రశ్నలు వస్తాయి. ఇవి ఒక సూత్రానికి సంబంధించినవి మాత్రమే ఉంటాయి. సూత్రం నేర్చుకుంటే ఈ మార్కులను సులువుగా సాధించవచ్చు.

త్రికోణమితి : చివరి అభ్యాసం 11.3, 11.4లో నేర్చుకుంటే 4, 1 మార్కుల ప్రశ్నలు వస్తాయి. వీటిలో పట్టిక నేర్చుకుంటే ఎంతో ఉపయోగం.

సంఖ్యాశాస్త్రం : అంకమధ్యమం, మధ్యగతం, బహుళకంకు చెందిన 8 మార్కులు, సూత్రాలను వివరించడానికి 4, 2 మార్కుల ప్రశ్నలుంటాయి.

10 పాయింట్లు సాధించాలి



పరీక్షల్లో పదికి పది పాయింట్లు సాధించడమే ధ్యేయంగా పెట్టుకుని చదువుతున్నాను. అలాగే మంచి ఉత్తీర్ణతను సాధించి ఇంటర్‌లో ఎంపీసీ గ్రూపును తీసుకుని భవిష్యత్తులో ఇంజినీర్ కావాలనే గట్టి సంకల్పంతో ముందుకెళ్తున్నాను. ప్రత్యేక తరగతుల టెస్టుల్లో ఏ గ్రేడులో కొనసాగుతున్నాను. ఇంటికెళ్లగానే సాయంత్రం 7 గంటల నుండి 10 గంటల దాకా మళ్లీ తెల్లవారుజామున 4 గంటలకే లేచి చదువుతున్నాను. ఎందుకంటే ఆ సమయంలో చదివితే ఈజీగా గుర్తు పెట్టుకోవచ్చని ఉపాధ్యాయులు చెప్పారు.

– స్పందన, విద్యార్థిని, పదో తరగతి, చినగానిపల్లి ఉన్నత పాఠశాల, కమ్మవారిపల్లి

గణితంలో వంద సాధించొచ్చు



అన్ని సబెక్టులలో కంటే గణితం బాగా సాధన చేస్తే వందకు వంద మార్కులు సాధించొచ్చు. తద్వారా ఫలితాల్లో మంచి స్కోర్ రావడానికి అవకాశం ఉంటుంది. కష్టంగా ఉన్న చాప్టర్లను ప్రత్యేకంగా బోధిస్తున్నా. పరీక్షల్లో ఎక్కువ మార్కులు వచ్చే చాప్టర్లను విద్యార్థులకు తెలియజేస్తూ వాటిపై ఎక్కువ శ్రద్ధ కనబరుస్తున్నాం. ప్రత్యేక తరగతుల్లో డీ, ఈ గ్రేడులు వచ్చే విద్యార్థులపై మరింత శ్రద్ధ వహిస్తున్నాం. వందశాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా పని చేస్తున్నాం.

– అమృత, పీజీటీ (గణితం), ఆదర్శపాఠశాల, అమడగూరు

క్లుప్తంగా

ఉరుసుకు పటిష్ట బందోబస్తు


సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్

ఓడీచెరువు : చింతమానిపల్లి పంచాయతీ అచ్చామియాపల్లిలోని అచ్చామియా దర్గాలో సోమవారం నిర్వహించే ఉరుసుకు పటిష్ట బందోబస్తు నిర్వహించాలని డీఎస్పీ విజయ్ కుమార్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఉరుసుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారన్నారు. బందోబస్తుకు సంబంధించిన ఏర్పాట్లను డీఎస్పీ ఆదివారం రాత్రి పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

జాతీయ స్థాయి మ్యాథ్స్ పోటీలకు బత్తలపల్లి విద్యార్థిని


ప్రశంసాపత్రం, మెమొంటో అందుకుంటున్న విద్యార్థిని అద్విక

బత్తలపల్లి: విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీలో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించిన శ్రీజ్యోతి హైస్కూల్‌లో చదువుకుంటున్న బత్తలపల్లికి చెందిన అద్విక జాతీయస్థాయి మ్యాథ్స్ పోటీలకు ఎంపికైంది. నిర్వాహకులు విద్యార్థినికి ప్రశంసా పత్రం, మెమొంటో అందజేశారు. హైదరాబాద్‌లో జాతీయస్థాయి పోటీలు జరుగుతాయని శ్రీజ్యోతి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మిడతల లక్ష్మీనారాయణ తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

గ్రామ కమిటీల ఏర్పాటు


ఎంపికైన బసంపల్లి గ్రామ కమిటీ సభ్యులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని బసంపల్లి గ్రామంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బసంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కక్కలపల్లి మహేష్, ఉపాధ్యక్షులుగా కుణుతూరు శంకర్, చిత్రా రాజశేఖర్, ప్రధాన కార్యదర్శులుగా కుమ్మర నాగరాజు, నాగరాజు, కార్యదర్శులుగా పెన్నోబిలేసు, రామాంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా ఎర్రిస్వామి, రాము, శివయ్య, వెంకటేష్, అక్కన్న, వెంకట్రాముడు, నాగిశెట్టి, భాస్కర్, లక్ష్మీనారాయణ, మనినాయక్, చంద్ర, రామాంజనేయులు, శ్రీరాములు, శ్రీనివాసులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు నారాయణ స్వామి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ నారాయణనాయక్ మృతి


పోలీసు లాంఛనాలతో నారాయణనాయక్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనంతపురం టూటౌన్ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ నారాయణనాయక్ శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈయన స్వస్థలం పుట్టపర్తి మండలం పెడపల్లి. ఈయనకు భార్య శాంతిబాయి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. వారి వ్యవసాయ తోటలో అనంతపురం టూటౌన్ సీఐ శ్రీకాంత్, పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ లింగన్న, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, హరినాథ్, లక్ష్మీనారాయణ, గాండ్ల హరినాథ్, సిబ్బంది, బంధువుల సమక్షంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

బ్లాక్ స్పాట్‌లో లైట్ల ఏర్పాటు

ధర్మవరం రూరల్: సీతారాంపల్లి క్రాస్ 44వ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించిన పోలీసులు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ధర్మవరం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు, క్యూబ్ స్టాప్ రెస్టారెంట్ వారి సహకారంతో క్రాస్ వద్ద రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరగకుండా ఆదివారం ఐదు లైట్లు ఏర్పాటు చేశారు. అంతకు ముందు ప్రమాదాల నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

క్రీడలతో ఒత్తిడి నుంచి ఉపశమనం


షటిల్ టోర్నీ విజేతలకు బహుమతులు అందిస్తున్న ముఖ్య అతిథులు, నిర్వాహకులు

ధర్మవరం అర్బన్: క్రీడల వల్ల ఉద్యోగులకు పని ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆదిశేషు, కళాజ్యోతి కమిటీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది రాఘవేంద్ర, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని కళాజ్యోతిలో ఏఐఎల్‌యూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మవరం ఎంప్లాయీస్ షటిల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు హాజరైన వారు మాట్లాడుతూ ఉద్యోగులు నిత్యం ఒత్తిడికి గురవుతుంటారన్నారు. ఇలాంటి క్రీడల వల్ల మానసిక ఒత్తిడి నుంచి తట్టుకోవడంతోపాటు ఆరోగ్యకరంగా ఉండవచ్చన్నారు. అనంతరం మొదటి విజేతలు పోలీస్‌టీం కృష్ణమోహన్, రాజాలకు దాత గొర్తి సుధాకర్‌నాయుడు చేతులమీదుగా రూ.10 వేలు, మెమొంటో, రెండో విజేతగా ఉపాధ్యాయులు హనుమంతరెడ్డి, శ్రీనివాసులుకు దాత పల్లెం కృష్ణ చేతుల మీదుగా రూ.5 వేలు, మెమొంటో, టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులకు మెమొంటోలను ఎర్రజోడు చంద్రశేఖర్ అందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రవీణ్, నరసింహమూర్తి, కరీం, నూర్‌మహమ్మద్, కళాజ్యోతి కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి సేవకు గుర్తింపు


బంగారు నంది అవార్డు అందుకుంటున్న ఉమ్మాల చంద్రశేఖర్

బత్తలపల్లి: విశ్రాంత ఉపాధ్యాయుడు ఉమ్మాల చంద్రశేఖర్ విద్యా– సామాజిక సేవలో చేసిన కృషిని విజయవాడకు చెందిన తెలుగు కళా రత్నాలు– సాంస్కృతిక సేవా సంస్థ గుర్తిస్తూ అవార్డుతో సత్కరించింది. బత్తలపల్లికి చెందిన చంద్రశేఖర్ 37 ఏళ్ల పాటు ఉపాధ్యాయునిగా పనిచేసి ఇటీవల రిటైర్ అయ్యారు. ఆయన పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, పుస్తకాలు అందజేయడం, వృద్ధుల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం, కరోనా సమయంలో పేదలకు నిత్యావసర సరుకులు అందజేయడంతో పలువురి మన్ననలు పొందారు. ఆయన సేవలను గుర్తించిన తెలుగు కళా రత్నాలు– సాంస్కృతిక సేవా సంస్థ ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో బంగారు నంది అవార్డు అందజేసింది. ప్రశంసా పత్రం అందజేసి, శాలువా కప్పి సన్మానించింది. కార్యక్రమంలో ఆ సంస్థ సీఈఓ డాక్టర్ రత్నం, డాక్టర్ ఉషారాణి, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్టాపన


వీరభద్రస్వామి విగ్రహం

పుట్టపర్తి అర్బన్: భద్రకాళి సమేత వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ముగిశాయి. వందల ఏళ్ల చరిత్ర కలిగిన స్వామి ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించి నూతన ఆలయాన్ని నిర్మించారు. మూడు రోజులుగా జరిగిన ప్రత్యేక పూజలు, హోమాలు ఆదివారం మధ్యాహ్నం జరిగిన పూర్ణాహుతితో ముగిశాయి. కర్ణాటక పురోహితులు పూజలు నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. పూజల అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహామంగళ హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

22న కల్యాణ మహోత్సవం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చెరువుకట్ట సమీపాన కాశీ విశాలాక్షి సహిత కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో ఈ నెల 22న పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు కైప ద్వారకనాథ్‌శర్మ తెలిపారు. స్థానిక ఆలయంలో ఆదివారం కల్యాణోత్సవ కరపత్రాలను శివదీక్ష మాలధారులతో కలిసి ప్రధాన అర్చకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22న సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం, 23న సాయంత్రం 6.30 గంటలకు గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ మహేష్ కోరారు. ఆర్డీఓ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి మీ సేవ, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి మరో కీలక ముందడుగు వేసినట్లు తెలిపారు. జీఓ 30ను అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం –2025 పేరిట భూముల క్రమబద్ధీకరణ చేపడుతామని వివరించారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే పంపిణీ చేస్తామని తెలిపారు. 2019 అక్టోబర్ 15ను ప్రామాణిక తేదీగా తీసుకుని, ఆ తేదీ కంటే ముందు ఆక్రమణలో ఉన్న భూములను నిబంధనలు అనుసరించి క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి 151 నుంచి 300 గజాల్లోపు ఆక్రమణలను బేసిక్ ధరలో 15 శాతం రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న వారు 200 శాతం బేసిక్ ధర పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు కట్టాల్సి ఉంటుందని వివరించారు. 450 గజాలకు మించిన ఆక్రమణలో ఎవరు ఉన్నప్పటికీ బేసిక్ ధరకు ఐదురెట్లు 100 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. అర్హుల జాబితా ఖరారు అయిన అనంతరం ఆ వివరాలను తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపుతామన్నారు.

పాల పొంగుల సందడి

బత్తలపల్లి: మాఘ మాసం దీక్షలు చేపట్టిన పలువురు మహిళలు రెండో ఆదివారం పాల పొంగులు నిర్వహించారు. మాఘ మాసం ప్రారంభమైనప్పటి నుంచి మాంసం భుజించడం మాని తెల్లవారుజామునే దేవాలయాలకు వెళ్లి ప్రదక్షణలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. అలాంటి వారు ఈ మాసంలో వచ్చిన ఆదివారాన్ని పురస్కరించుకుని మండలంలోని సంజీవపురం కాటికోటేశ్వర క్షేత్రం, సంగమేశ్వర క్షేత్రంలోనూ, మాల్యవంతం, రామాపురం, కోడేకండ్లలోని వీరనారాయణ స్వామి, డి.చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, ఈదుల ముష్టూరు, పోట్లమర్రి శివాలయంలోనూ, గంటాపురం అప్పస్వామి దేవాలయంలోనూ పాల పొంగులు నిర్వహించారు. దేవునికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో పండగ సందడి నెలకొంది.

ఉచిత కంటి ఆపరేషన్లతో పేదలకు ఊరట


కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: కంటి సమస్యతో బాధపడుతున్న పేదలకు ఉచిత ఆపరేషన్లు ఎంతో ఊరట కలిగిస్తాయని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ సత్యకృప శిల్క్స్ నిర్వాహకులు, వారి కుటుంబ పెద్దలైన సత్యనారాయణ, పద్మావతమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు, కోడళ్లు, కుటుంబ సభ్యుల సహకారంతో ఉచిత శిబిరాన్ని నిర్వహించారన్నారు. 96 మందికి కంటి పరీక్షలు చేసి.. అందులో 73 మంది ఆపరేషన్లకు ఎంపిక చేశారని తెలిపారు. బెంగళూరులోని శంకర్ కంటి ఆస్పత్రి వైద్యులు కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, కార్యదర్శి నాగభూషణ, ట్రెజరర్ సుదర్శన్‌గుప్తా, సభ్యులు సత్రసాల ప్రసన్నకుమార్, కొండయ్య, బండారు వెంకటాచలం, హరినాథ్, శివయ్య, పెరుమాల్ దాస్, జయచంద్ర, మనోహర్ గుప్తా, శ్రీనివాస్, శంకర్ కంటి ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

ధర్మవరం: పట్టణంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో ఆదివారం ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా అధ్యక్షుడు బుక్కచెర్ల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సభ్యులు రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, బత్తలపల్లి మండల నాయకులు సంజీవరెడ్డి, పెద్దన్న, తాడిమర్రి మండల నాయకులు నారాయణస్వామి, సీవీ రమణారెడ్డి, చిదంబర్‌రెడ్డి, మురళి, ఈశ్వర్, నారాయణరెడ్డి, గోపి, రామ్మోహన్‌రెడ్డి, చెన్నారెడ్డి, విజయ్‌కుమార్, బిల్లే భూషణప్ప, రామయ్య, ముత్యాలప్ప, శ్రీనివాసనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. భగవత్ ప్రార్థన, ఆరాధన, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, దీపారాధన, అంకురార్పణ, పూర్ణాహుతి కార్యక్రమాలను అర్చకులు సుదర్శన ఆచార్యులు నిర్వహించారు.

నేడు పరిష్కార వేదిక

ధర్మవరం/ బత్తలపల్లి: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని సూచించారు. బత్తలపల్లి తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు.

రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య

ముదిగుబ్బ: రాష్ట్రంలో భూమి గల ప్రతి రైతుకూ ఒక ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించనున్నట్లు వ్యవసాయాధికారి లక్ష్మీనరసింహులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి, ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ఈ సంఖ్యను పొందాలంటే ఆధార్ నంబర్, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబర్, భూమి రికార్డుల వివరాలు తీసుకొని గ్రామంలో రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

రవూఫ్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

కదిరి టౌన్: కుటాగుళ్లలో కామ్రేడ్ ఎస్‌పీ రవూఫ్‌కు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం రవూఫ్ 11వ వర్ధంతి నిర్వహించారు. రవూఫ్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఇర్ఫాన్, హరిప్రసాద్, ట్రస్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు చిగిచెర్ల విద్యార్థిని


యశస్వినితో పీడీ ప్రతాప్‌రెడ్డి

ధర్మవరం రూరల్: చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని యశస్విని జాతీయ స్థాయి జూడో పోటీలకు అర్హత సాధించిందని పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల పది నుంచి 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఆ పోటీల్లో యశస్విని ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొంటుందన్నారు. ఎంపికైన క్రీడాకారిణిని ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్ర ఉపాధ్యక్షునిగా రామ్మోహన్



కదిరి అర్బన్: పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కదిరి కుంట్లపల్లి కార్యదర్శి రామ్మోహన్‌ను ఆ సంఘం నాయకులు ఆదివారం ఎన్నుకున్నారు. తనపై నమ్మకం ఉంచి ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ సమూల మార్పుల కోసం వేసిన కమిటీ దృష్టికి పంచాయతీ కార్యదర్శుల సమస్యలను తీసుకెళ్తానని పేర్కొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా సకల రాజా


సకల రాజాను అభినందిస్తున్న నాయకులు

ధర్మవరం: ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ధర్మవరానికి చెందిన సకల రాజా ఎంపికయ్యారు. శ్రీకాకుళంలో ఈ నెల 6, 7, 8, 9 తేదీల్లో నిర్వహించిన ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలలో ఈ మేరకు ఎంపిక చేశారు. ఆదివారం సకల రాజాను నాయకులు అభినందించారు.

షాదీమహల్ నిర్మాణాలు చేపడతాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

తనకల్లు: కదిరి నియోజకవర్గంలోని ప్రతి మండలంలోనూ షాదీ మహల్ నిర్మిస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. తనకల్లులోని ఎస్‌ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఇమాం, మౌజన్ల ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇమాం, మౌజన్లకు ఇంటి పట్టాలు అందజేస్తామన్నారు. త్వరలోనే వారికి గౌరవ వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.


వెంగళమ్మ చెరువు ఉన్నత పాఠశాల, పట్నం జెడ్పీ హైస్కూల్‌లో నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మధుర జ్ఞాపకం

కదిరి అర్బన్/ పుట్టపర్తి : వారంతా 20 ఏళ్ల కిందట కలిసి చదువుకున్నారు. తర్వాత వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మళ్లీ ఒకసారి అందరూ చదువులమ్మ ఒడిలో కలిసి ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కదిరి మండలం పట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–2004లో పదో తరగతి చదివిన వారు, పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు ఉన్నత పాఠశాలలో 2004–2005లో టెన్త్ పూర్తి చేసిన వారు ఆదివారం తమ పాఠశాలల్లో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. యోగ క్షేమాలు తెలుసుకున్నారు. నాడు తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. తాము చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి తమవంతుగా చేయూతనందిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కదిరి టౌన్: పట్టణంలోని నల్లగుట్ట వీధిలో అక్రమంగా విక్రయిస్తున్న 30 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. మద్యం విక్రయిస్తున్న షేక్ గౌస్‌పీర్, రహీంసాబ్‌పై కేసు నమోదు చేసి, వారి నుంచి ద్విచక్రవాహనం కూడా స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక మద్యం రవాణా చేసే గోపీ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.